# జనపదం
J A N A P A D H A M

హైదరాబాద్ | సోమవారం 21 అక్టోబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 133

తెలుగు దినపత్రిక




## సీఎం చెంతకు 317 జీవో తుది నివేదిక..!

సీఎం చెంతకు 317 జీవో తుది నివేదిక..!

సమర్థించిన సబ్ కమిటీ

10 నెలల పాటు అభిప్రాయాల సేకరణ

సర్కార్ నిర్ణయంపై ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో టెన్షన్..

2




## విషమ పరీక్ష..

- ఉదయం సుప్రీంలో వాదన..
- మధ్యాహ్నం పరీక్ష..
- గ్రూప్ 1 అభ్యర్థులకు సంకటం..
- నలుగుతున్న నిరుద్యోగులు..
- అన్యాయమవుతున్న బతుకులు..

2

ఒకే పరీక్షకు రెండు పేపర్లు అన్నట్టుంది గ్రూప్ 1 అభ్యర్థుల పరిస్థితి. జీవో 29 పై తీవ్ర వ్యతిరేకతతో ప్రభుత్వంపై నిరసనకు దిగిన నిరుద్యోగులు లాఠీ దెబ్బలు కూడా తిన్న విషయం తెలిసిందే. కాగా, సర్కార్ పట్టించుకోకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించగా సోమవారం ఉదయం విచారణ ఉంది. కాగా, రేవంత్ ప్రభుత్వం కూడా తగ్గేదేలే.. అన్నట్టుగా సోమవారం మధ్యాహ్నం నుంచి పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసింది. అసలేం జరుగుతుందో తెలియని అనిశ్చితి వేళ అభ్యర్థులు పరీక్షకు సిద్ధమవ్వాల్సిన దుస్థితి.




## భరోసాపై భగ్గుమన్న బీఆర్ఎస్..

**రాష్ట్రవ్యాప్తంగా నిరసనల హోరు.. ఆందోళనలు.. ఆగ్రహావేశాలు.. రైతులతో కలిసి ధర్నాలు**

**జనపదం, నెట్ వర్క్ :**
బీఆర్ఎస్ శ్రేణులు నిరసనలతో రాష్ట్ర వ్యాప్తంగా హోరెత్తించాయి. రైతు భరోసాపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటను తప్పడం ఇచ్చిన హామీలపై మాటిమాటికి మాట మార్చడంపై తీవ్ర స్థాయిలో అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తూ హైదరాబాద్ మినహా మిగిలిన అన్ని జిల్లాలోని ప్రధాన కేంద్రాల్లో పెద్దఎత్తున ఆందోళనలకు దిగాయి. ఇందులో భాగంగా రైతులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశాయి. ఈ చర్యలను పలు జిల్లాలో పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో అక్కడక్కడ కొన్ని మండల కేంద్రాల్లో ఒకింత ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. రైతు భరోసాపై నిరసనలు చేట్టాలని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆదివారం మండల కేంద్రాల్లో పార్టీ శ్రేణులు నిరసన ......(తరువాయి 4లో)

## కుల గణనకు 60 ప్రశ్నలు

- ఎక్కడుంటున్నారు.. ఏం తింటున్నారు..?
- గతంలో సంక్షేమ పథకాలపైనా ఆరా
- 1.10 కోట్ల కుటుంబాల నుంచి వివరాలు సేకరణ
- 3 వేలకుపైగా సిబ్బంది
- 15 రోజులు క్షేత్రస్థాయి సర్వే... ఆ తర్వాత నివేదికలు
- నెలాఖరులోగా కుల గణన సర్వేకు వెళ్లేందుకు చాన్స్

4

పాలిచ్చే బర్రెను ఇడ్సిపెట్టి.., తన్నే బర్రెను పట్టుకున్నట్టున్నది కొత్తగా పీఠాలు దక్కించుకున్న వారి పరిస్థితి. పార్టీ అధికారంలోకి వచ్చింది., పదవి వరించింది.., సో హ్యాపీ. జీవితానికి ఇంతకన్నా ఏం కావాలి. దర్జాకు దర్జా., పలుకుబడికి పలుకుబడి., అధికారిక కార్యక్రమాల్లో మర్యాద. ఎన్నాళ్లుగానో చూసిన నిరీక్షణకు ఫలితం దక్కిందన్న సంబురం. ఇక్కడి వరకు అంతా బాగానే ఉన్నా.., అస్సలు ట్విస్ట్ అప్పుడే మొదలైంది. పదవి దక్కిందని సంబురపడాలో.., ప్రతిఫలం ఊరిస్తూనే ఉందని మదనపడాలో అర్థం కాని పరిస్థితుల్లో వారంతా కొట్టుమిట్టాడుతున్నారు. అందలం ఎక్కామన్న సంబురం కూడా వారిని ఆనందంగా ఉంచలేకపోతున్నది. తృణమో., ఫణమో దక్కితేనే పదవికి అందం అని తెలిసినా, అవేవీ లేకుండానే 'అనుభవించండి..' అన్నట్టుగా వ్యవహరిస్తున్న పార్టీ అధిష్టానం తీరుతో వారంతా మదనపడుతున్నారు. ఆఖరుకు చాయ్, బిస్కెట్ పైసలు కూడా ఇచ్చే అవకాశాలపై ఒకటికి పదిసార్లు ఆలోచించి చెబుతామంటున్న తీరుతో ఇటు కక్కలేక., అటు మింగలేక నోరు నొక్కుకుని కుక్కిన పేనులా పదవిని పట్టుకుని వేలాడుతున్నారు..

# పేద్ద... బొక్కా...

## దండగమారి పదవులు

- జీతం లేదు.. భత్యం లేదు
- చాయ్, బిస్కెట్లకు పైసల్లేవ్
- సొంత జేబు నుంచి నెలకో లక్ష
- కార్పొరేషన్ చైర్మన్లకు ఆర్థిక గండం
- పదవుల్లో చేరినప్పటి నుంచీ రూపాయి లేదు



**జనపదం, బ్యూరో**
రాష్ట్రంలో రాజకీయ నేతలకు పదవీ సంబురం లేకుండా పోయింది. పదేండ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఆశ పెట్టి.. ఆశ పెట్టి ఇటీవలే కొన్ని కార్పొరేషన్లతో పాటుగా వివిధ విభాగాల్లో పదవులను భర్తీ చేసింది. నిజానికి పార్లమెంట్ ఎన్నికలకు ముందే 37 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించింది. కానీ, అనూహ్యంగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాటిని పెండింగ్ పెట్టింది. ఎన్నికల ప్రక్రియ పూర్తికాగానే.. అదే పాత తేదీల్లో జీవో జారీ చేసింది. అప్పటి నుంచి 37 కార్పొరేషన్లకు చైర్మన్లు నియమితులయ్యారు. కానీ, వీరికి పదవీ సంబురమే మిగిలింది. కుర్చీ ఎక్కినప్పటి నుంచి రూపాయి లేక ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతున్నారు.

### పదవి మాత్రమే.. పైసల్లేవ్

రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్లతో పాటుగా పలు పోస్టులను రేవంత్ సర్కారు నియామకం చేసింది. ప్రస్తుతం గత ప్రభుత్వ అప్పులు, అప్పటి పనులపై విచారణ అంటూ కొంతకాలం కాలయాపన చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు హైడ్రా, మూసీ పరిరక్షణ అంటూ సాగదీస్తున్నది. మరోవైపు ప్రతినెలా ఉద్యోగుల జీతాల కోసం కూడా అప్పులు తేవాల్సిన పరిస్థితి ఉంది. అంతే కాకుండా ఇప్పటి వరకూ ఏకంగా 80 వేల కోట్ల అప్పులు తీసుకున్నది. రోజువారీ ఖర్చుల కోసం కూడా నానా తంటాలు పడుతున్నట్లు ఆర్థిక శాఖ అధికారులు చెప్పుతూనే ఉన్నారు. అయితే, ఇలాంటి పరిస్థితుల్లో కార్పొరేషన్ల చైర్మన్లుగా నియమితులైన వారికి అప్పటి నుంచి ఇప్పటి దాకా రూపాయి జీతం ఇవ్వలేదు. ఒక్కో కార్పొరేషన్ చైర్మన్కు రెండు లక్షల జీతం, ఇతర అలవెన్సులు అంటూ జీవోలు జారీ చేసినా జీతం కింద రూపాయి విడుదల చేయలేదు. సంబంధిత శాఖల నుంచి తీసుకునేందుకు కూడా వాళ్లకు అవకాశం లేకుండా పోయింది. చైర్మన్ల జీతాల ఫైల్ను కూడా ఆర్థిక ......(తరువాయి 3లో)

# యావత్ ప్రపంచమే పోటీ..




### తెలంగాణ స్థాయి అలాంటిది..

- ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చుతాం
- ఎక్కడికెళ్లినా రాష్ట్రం, హైదరాబాద్ గురించి చెప్పండి
- ఒలింపిక్స్ పథకాల సాధన టార్గెట్
- ఎడ్యుకేషనల్ హబ్‌గా రాష్ట్రం
- నాయకులుగా ఎదుగాలంటే ధైర్యం ముఖ్యం
- నిత్యం ప్రజలతోనే మెలగాలి
- ఐఎస్బీ లీడర్షిప్ సమ్మిట్లో సీఎం రేవంత్ రెడ్డి

**జనపదం, బ్యూరో :**
తెలంగాణను కేవలం న్యూయార్క్, పారిస్, లండన్తో పోల్చాలనుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రపంచంతో పోటీ పడాలని, ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చుతామని, అదే తమ ముందు ఉన్న లక్ష్యమని వెల్లడించారు. ఆ లక్ష్యాన్ని చేరుకోవాలంటూ హైదరాబాద్ను 600 బిలియన్ డాలర్ల నగరంగా మార్చాలని సీఎం చెప్పారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నాయకత్వ శిఖరాగ్ర సదస్సు– 2024లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఐఎస్బీలోని విద్యార్థులు నాయకత్వ లక్షణాలు మెరుగుపరుచుకునేందుకు ఏడాదికోసారి ప్రముఖులు, వక్తలతో యాజమాన్యం సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే.. ఈ క్రమంలోనే ఈ యేడాది ఐఎస్బీ లీడర్ షిప్ సమ్మిట్కు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరై విద్యార్థులకు సూచనలు చేశారు. ఇక్కడున్న ప్రతి ఒక్కరు తెలంగాణలో 2, 3 ఏళ్లు పని చేయాలని, తమ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల తరహాలో మంచి జీతాలు ఇవ్వలేకపోవచ్చు కానీ, మంచి సవాళ్లు, జీవితానికి సరిపడా నాలెడ్జ్ను మాత్రం అందిస్తుందని చెప్పారు. ఒలింపిక్స్లో భారత్ దురదృష్టవశాత్తు స్వర్ణ పతకాలు గెలవలేకపోయిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఒలింపిక్స్లో అత్యధిక పతకాలు గెలవడమే లక్ష్యంగా పని ......(తరువాయి 4లో)

# ఊరుకుందామా.. ఉరికిద్దామా..?

## రేవంత్ రైతు వ్యతిరేకి..

- మాటిచ్చి బురిడికొట్టించే మోసకారి..
- ప్రజలకు చెందాల్సినవి ఒక్కోటి కట్ చేస్తున్నాడు...
- సీఎంను నిలదీయాల్సిన తరుణం వచ్చింది..
- ప్రజల కోసం పోరాటం చేస్తూనే ఉంటాం..
- ప్రాణాలు పోయినా పట్టించుకోం..
- మాజీ మంత్రి హరీశ్ రావు
- మానకొండూరులో అలయ్ బలయ్
- కాంగ్రెస్ సర్కార్ పై విమర్శనాస్త్రాలు..

**జనపదం, కరీంనగర్ బ్యూరో:**
మోసం చేసినా కాంగ్రెస్ ను ఉరికిద్దామా., లేదంటే ఊరుకుందామా..?ప్రజలే తేల్చాలని మాజీ మంత్రి హరీష్ రావు కోరారు. కాంగ్రెస్ హనీమూన్ పీరియడ్ అయిపోయిందని, ఇక పోరాటం చేయాల్సిన తరుణం వచ్చిందని ప్రకటించారు. మానకొండురు నియోజకవర్గ బీఆర్ఎస్ కుటుంబ ఆత్మీయ సమ్మేళనం అలయ్ బలయ్ కార్యక్రమం ఆదివారం నియోజకవర్గంలో జరిగింది. కార్యక్రమానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశం చూస్తే 2001 నాటి రోజులు గుర్తు వస్తున్నాయని, అదే స్ఫూర్తి ......(తరువాయి 3లో)






## బంగాళాఖాతంలో 'దానా' తుపాను...

- ఏపీలో మళ్లీ వర్షాలు
- రాగల 24 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం
- వాయువ్య దిశగా పయనిస్తుందని వెల్లడి

2

## ఎక్కడా అన్యాయం జరగదు..



- గ్రూప్ -1 అభ్యర్థులు పరీక్షలు రాయండి
- జీవో నెంబర్ 29తో నష్టం లేదు
- ఇంటర్ ఫలితాలు ఇవ్వలేని బీఆర్ఎస్ గ్రూప్స్ పై మాట్లాడడం విడ్డూరం..
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

4

## భయపడకండి..



- అనుమతులుంటే కూల్చం..
- సీఎం ఆదేశాలకు కట్టుబడి ఉన్నాం
- చట్టబద్ధమైన పర్మిషన్లున్న వెంచర్లను ముట్టుకోం
- చెరువుల వద్ద నిర్మాణాలపై హైడ్రా ప్రకటన

4

## నిరసనకారులపై లాఠీచార్జ్ సరికాదు..



- పోలీసుల దమనకాండ కాంగ్రెస్ దురహంకారానికి నిదర్శనం
- బీఆర్ఎస్, కాంగ్రెస్ విధానాలు ఒక్కటే
- హిందూ వ్యతిరేకిగా సీఎం వ్యవహారం..
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

4

# ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర

- బీఆర్ఎస్,బీజేపీవి చీకటి ఒప్పందాలు
- హైడ్రా పేదల జోలికి వస్తే ఉపేక్షించబోం
- భూముల కబ్జాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- ఖరీఫ్ పంటకు రైతు భరోసా ఇవ్వాల్సిందే
- గ్రూప్ -1 సమస్యలపై విద్యార్థులు, నిరుద్యోగులతో చర్చించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**జనపదం, సిటీబ్యూరో:** బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు పేదల భుజాలపై తుపాకులు పెట్టి ప్రజల చేత ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నానికి ఒడిగడుతున్నాయని, ఇలాంటి చర్యలను సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. హైదరాబాద్ లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్ లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ,రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస్, ఎన్.బాలమల్లేష్ తో కలిసి ఆయన మాట్లాడారు. హైడ్రా అత్యుత్సాహంతో అనాలోచితంగా పేదలు, మధ్యతరగతి ప్రజల ఇళ్లు కూల్చుతున్నదని, దీనిని ఆసరాగా చేసుకున్న బడాబాబులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని, ప్రభుత్వ అప్రమత్తంగా ఉండాలని మిత్రపక్షంగా సూచిస్తున్నామన్నారు. మూసీ పునరుజ్జీవనంపై అన్ని రాజకీయ, ప్రజా సంఘాలు, మేధావులు, పర్యావరణవేత్తలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు తమ చికటి ఒప్పందంలో భాగంగా ఒకరిని ఒకరు విమర్శించుకుంటున్నట్లు నాటకమాడుతున్నాయన్నారు. రాష్ట్రంలో అసలు సమస్యలను పక్కదారి పట్టిస్తూ చిన్న అంశాలను కూడా సాకుగా చేసుకుని కృతిమ అలజడి సృష్టిస్తున్నాయని కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అశాంతి నెలకొల్పి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకునేలా చేసి శాంతిభద్రతలను సాకుగా చూపి ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. మూసీ పునరుజ్జీవనం అంశంలో పేదలను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ తమ అక్రమ ఆస్తులను కాపాడుకునేందుకు యత్నిస్తోందన్నారు.

### పేదల జోలికి వస్తే ఉపేక్షించబోం

హైడ్రా పేదల జోలికి వస్తే సీపీఐ ఎట్టి పరిస్థితుల్లోనూ




ఉపేక్షించబోదని, మిత్రపక్షం మిత్రపక్షమే.. పోరాటం పోరాటమేనని కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. మూసీ పునర్జీవనంలో భాగంగా అక్కడ నివసిస్తున్న పేద ప్రజలకు అన్ని విధాలుగా న్యాయం జరిగేలా పునరావాసం కల్పించి వారిని ఒప్పించి, మెప్పించి అక్కడి నుంచి తరలించాలే తప్ప బలవంతంగా ఖాళీ చేయించవద్దని అన్నారు. హైడ్రా కమిషనర్ తన ప్రతాపం చూపాల్సింది పేదలపై కాదని, భూకబ్జాదారులపై చూపాలన్నారు. హైడ్రా అత్యుత్సాహం, తొందరపాటు నిర్ణయాల వల్ల అసలు లక్షం గురి తప్పిందని సాంబశివ రావు విమర్శించారు.

### శ్వేతపత్రం విడుదల చేయాలి

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భూములు, అన్యాక్రాంతం, కబ్జాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెరువులు, కుంటలు, నాలాల వద్ద ఇళ్లు కట్టుకుని ఏళ్ల తరబడి ఉంటున్న పేదలను గుర్తించి వారికి పూర్తిస్థాయిలో ప్రత్యామ్నాయం కల్పించి అన్ని విధాలుగా ఆదుకుని ప్రభుత్వం భరోసా కల్పించాలన్నారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలందరికీ 58, 59 తదితర ఏ జీఓ వర్తిస్తే దాని కింద వారి స్థలాలను క్రమబద్ధీకరించాలని తెలిపారు. మధ్యతరగతి ప్రజలు తెలిసీతెలియక, చెరువులు, కుంటలు, నాలాల వద్ద ఇళ్లు నిర్మించుకున్న వారిని తొలగించే క్రమంలో వారికి స్థలంతో పాటు భవన నిర్మాణ ఖర్చులను లెక్కకట్టి చెల్లించిన తర్వాతే వారిని ఖాళీ చేయించాలని ప్రభుత్వానికి సూచించారు. భూబకాసురులు కబ్జాలకు పాల్పడిన లెక్కలను తేల్చి వాటిని పరిరక్షించడంతో పాటు వారి నుంచి అమ్ముకున్న డబ్బులు వసూలు చేయాలని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### రైతు భరోసా ఇవ్వాల్సిందే

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఖరీఫ్ పంటకు కూడా రైతు భరోసా ఇవ్వాల్సిందేనని కూనంనేని సాంబశివ రావు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా తప్పించుకునే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేయడం సరైంది కాదని, అదే జరిగితే గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా ఉండదన్నారు. రైతు రుణమాఫీపై కూడా ప్రభుత్వం పూర్తి స్పష్టత ఇవ్వాలని, ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాల్సిందేనని ఆయన స్పష్టంచేశారు.

### నిరుద్యోగులతో చర్చించాలి

గ్రూప్1 మెయిన్స్ పరీక్షపై నిరుద్యోగుల్లో నెలకొన్న అనుమానాలను ప్రభుత్వం ముందుగా నివృత్తి చేయాలని, నిరుద్యోగ, యువజన, విద్యార్థి సంఘాల నాయకులతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని కూనంనేని సాంబశివరావు కోరారు. ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అన్ని రంగాలకు సంబంధించి బిల్లుల బకాయిలు పేరుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

### హైడ్రా కమిషనర్ ఏమి చేస్తున్నారు

- సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్

హైడ్రా కమిషనర్ రంగానాథ్ అసలు ఏమి చేస్తున్నారో, ఎక్కడ ఉన్నారో కూడా తెలియడంలేదని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హుస్సేన్ సాగర్ ఆక్రమించి జలవిహార్ నిర్మించి యథేచ్ఛగా వ్యాపారం చేసుకుంటూ సాగర్ జలాల కాలుష్యానికి పాల్పడుతోందని సీపీఐ ప్రతినిధి బృందం అన్ని ఆధారాలతో సహా హైడ్రా కమిషనర్ రంగానాథ్ ను కలిసి ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా ఆయన ఇప్పటివరకు చిన్న చర్య కూడా తీసుకోపోవడం దారుణమన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజల ఇళ్లను క్షణాల్లో కూల్చివేస్తున్న హైడ్రా కమిషనర్ బడాబాబులంటే ఎందుకింత ప్రేమ అర్థం కావడంలేదన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ స్వయంగా కలిసి తేల్చుకుంటామని ఆయన చెప్పారు.

### పెద్ద పార్టీలకు కాలం చెల్లింది

దేశ వ్యాప్తంగా ఇక పెద్ద పార్టీలకు కాలం చెల్లినట్లేనని, పెద్ద నాయకులను చూసి ఓట్లు వేసే పరిస్థితి కూడా లేదని అజీజ్ పాషా తెలిపారు. ఇది ఇటీవల జరిగిన హర్యానా, జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో స్పష్టమైందని ఆయన వెల్లడించారు. హర్యానా, జమ్ముకాశ్మీర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు, చిన్న పార్టీలు ఏకంగా 20శాతం ఓట్లు పొందాయని ఆయన వెల్లడించారు. అక్కడే కాదని, అన్ని రాష్ట్రాలలో చిన్న పార్టీలు, స్థానిక పార్టీలకు ఆధారణ పెరుగుతోందని, దీంతో సంకీర్ణ ప్రభుత్వం శకం రాబోతుందని స్పష్టమవుతోందని తెలిపారు.

# బంగాళాఖాతంలో 'దానా'

- ఏపీలో మళ్లీ వర్షాలు
- రాగల 24 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం
- తుఫానుగా మారే అవకాశం ఉందన్న ఆర్ఎంసీ
- వాయువ్య దిశగా పయనిస్తుందని వెల్లడి



**జనపదం, బ్యూరో:** బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం క్రమంగా బలపడి వాయుగుండంగా, ఆపై తుఫానుగా మారనుందని చెన్నైలోని ప్రాంతీయ వాతావరణ సంస్థ (ఆర్ఎంసీ) వెల్లడించింది. ఈ తుపానుకు 'దానా' అని నామకరణం చేసినట్టు తెలిపింది. రాగల 24 గంటల్లో ఉత్తర అండమాన్ సముద్రాన్ని ఆనుకుని తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని ఆర్ఎంసీ వివరించింది. ఇది వాయవ్య దిశగా పయనించి నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశిస్తుందని పేర్కొంది. కాగా, ఈ అల్పపీడనం మంగళవారం నాటికి వాయుగుండంగా, బుధవారం నాటికి తుపానుగా మారే అవకాశం ఉన్నట్టు భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) వెల్లడించింది. ఈ నెల 25న కోస్తాంధ్ర, యానాంలో అక్కడక్కడ అతి భారీ వర్షాలు... ఈ నెల 20, 24 తేదీల్లో కోస్తాంధ్ర, యానాంలో కొన్నిచోట్ల భారీ వర్షాలు... ఈ నెల 20న రాయలసీమలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఐఎండీ వెల్లడించింది. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు ఈ నెల 21 కల్లా తిరిగొచ్చేయాలని సూచించింది. ఇక తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# పేద్ద..బొక్కా..

**(మొదటిపేజీ తరువాయి)** శాఖ అటు సీఎంకు, డిప్యూటీ సీఎంకు పంపిస్తున్నారు. ఇప్పటికే మార్చి నుంచి అక్టోబర్ వరకు జీతాలు పేరుకుపోయాయి. దీంతో ఒక్కసారి వాళ్లందరికీ జీతాల సొమ్మును విడుదల చేసేందుకు ప్రభుత్వం సాహసించడం లేదు.

### సొంత ఖర్చులు తడిసిమోపెడు

పదేండ్ల తర్వాత కాంగ్రెస్ నేతలకు పదవుల ఆశ నెరవేరుతున్నది. ఈ నేపథ్యం లో పదవి వచ్చింది.. జీతం రూపంలో లక్షల కు లక్షలు వస్తాయని కొంత ఆశపడినా.. జేబుల్లోకి మాత్రం రూపాయి రావ డం లేదు. ఇదే సమయంలో పదేండ్ల నుంచి తమ వెంట తిరిగిన నేతలు, అనుచరులకు కనీసం రూపాయి పని ఇవ్వలేని పరిస్థితులు నెలకొన్నాయి. సొంతంగా ఏదైనా ఆర్థిక అవసరాలు తీర్చుదామంటే.. వారికే చాలా ఖర్చులు వెంటాడుతున్నాయి. ఆఫీస్కు వ స్తే.. చాయ్, బిస్కెట్లు, మధ్యాహ్నం భోజనాలు అంటూ వేలు ఖర్చు కావడంతో.. కొంతమంది చైర్మన్లు ఆఫీస్లకు కూడా రావడం లేదు. ఇటీవల దసరా పండుగ సందర్భంగా సిబ్బంది, అనుచరులకు ఏదైనా ఆర్థికంగా చేయాల్సిన పరిస్థితులు వచ్చాయని.. కొంతమంది చైర్మన్లు ఏకంగా ఊరు దాటేశారు. రాక రాక పదవి రావ డంతో వాళ్ల దగ్గరకు ఏదైనా ఆశించి వచ్చే వారు కూడా ఉంటున్నారు. వారికి కూడా జేబు నుంచి ఏదైనా యాల్సిన పరిస్థితే. వీటికితోడు వాహనాల మెయింటనెన్స్ కూడా భారమే అవుతుంది.

### బిల్లు లేదు

ఇటీవల ఓ కార్పొరేషన్ చైర్మన్ ఇష్టారీతిన లక్షలు ఖర్చు పెట్టినట్లుగా ఓ సంస్థ నుంచి బిల్లులు ట్రెజరీకి పంపించారు. కానీ, అక్కడి నుంచి వచ్చిన రిప్లై చూసి ఖంగుతిన్నట్లుగా మారింది. ఈ బిల్లులు చెల్లవని, అవన్నీ సొంతంగా భరించాల్సిందేనని సదరు శాఖ ఉన్నతాధికారి నుంచి రిప్లై వచ్చింది. కొత్తగా పదవి వచ్చింది... ఆఫీస్కు వచ్చిన వాళ్లకు కూడా చాయ్, బిస్కెట్లు తెప్పించాలి కదా.. అంటూ నెత్తినోరూ బాదుకున్నా.. రూపాయి విడుదల చేయలేదు. ఈ విషయం ఇటీవల ఓ క్లబ్లో బయటకు వచ్చింది.

# అబద్ధాల టెక్నిక్ తో రుణమాఫీ చేశారా?

**40 శాతం రైతులకు కూడా రుణమాఫీ జరగలేదు**

**ఎక్స్ వేదికగా సర్కార్‌కు కౌంటర్ ఇచ్చిన కేటీఆర్**



**జనపదం, హైదరాబాద్ సిటీ:** రాష్ట్రంలో 40 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసినట్లు జాతీయ కాం గ్రెస్ పార్టీ ట్విట్టర్ లో చేసిన పోస్ట్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రుణమా ఫీ చేసినట్లు ఇచ్చిన ప్రకటనలో ఏ విధంగా అయితే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) రూపొందించిన చిత్రాన్ని వాడారో...రుణమాఫీ జరిగిన రైతుల లెక్క విషయంలో కూడా మీ ముఖ్యమంత్రి (ఏఐ) టెక్నిక్ వాడారంటూ కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ పేర్కొన్న 40 లక్షల మంది రైతులు అనే సంఖ్య (అనుముల ఇంటెలిజెన్స్) అంటే రేవంత్ రెడ్డి వాడిన అబద్ధాల (ఏఐ) టెక్నిక్ తో రూపొందించిందేనని ఎద్దేవా చేశారు. నిజానికి తెలంగాణలో ఇప్పటి వరకు రైతు రుణాలు 40 శాతం కూడా మాఫీ కాలేదని చెప్పారు. కానీ తరుచూ నిబంధనలు మారుస్తూ రుణమాఫీ తేదీలు మారుస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి తన సొంత గ్రామంలో నూ, నియోజకవర్గంలోనూ కూడా రైతుల కు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. రుణమాఫీ విషయంలో నిబంధనలు, తేదీలు మారుతున్న ప్పటికీ.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో బూటకపు ప్రచారాలు మాత్రమే నిత్యం ఎలాంటి మార్పు లేకుం డా కొనసాగుతున్నాయని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రాజ్యాధికారం దిశగా ముదిరాజ్ లు ఎదగాలి

- ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలి
- మండలి చైర్మన్ బండ ప్రకాశ్, ఎంపీ ఈటల, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి
- కుషాయిగూడలో ఘనంగా అలాయ్- బలాయ్




**జనపదం, హైదరాబాద్:** తెలంగాణలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. దసరా పండుగ ఉత్సవాలను పురస్కరించుకొని కుషాయిగూడ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చక్రిపురంలోని సిరి గార్డెన్ లో నిర్వహించిన అలాయ్– బలాయ్ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా హాజరై పాల్గొన్నారు. ముదిరాజుల సంక్షేమానికి , సమస్యల పరిష్కారానికి తాము ఎల్లవేళలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ముదిరాజుల ఐక్యతే వారిని అభివృద్ధి దిశగా నడిపిస్తుందని వారు స్పష్టం చేశారు. ముదిరాజుల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి తమ వంతు సాయం చేస్తామన్నారు. అయితే స్థలాలు ఉంటే భవన నిర్మాణానికి నిధులను అందజేస్తామని వెల్లడించారు. ఇక ముదిరాజ్ విద్యార్థుల విద్య , వైద్యం తదితర సౌకర్యాల కల్పనలో ముందుంటామన్నారు. ఈ సందర్భంగా మన ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యువత అధ్యక్షుడు పండుగ బాలు ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కృపాసాగర్ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోర రవికాంత్ ముదిరాజ్ తదితరులు మాట్లాడుతూ... రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన వర్గంలో ఉన్న ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ– ఏ గ్రూపులోకి మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలన్నీ ముదిరాజులను విస్మరించాయని, రాజకీయంగా ఎలాంటి అవకాశం కల్పించలేదన్నారు. రాజ్యాధికారం కోసం ముదిరాజులు ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజుల సంక్షేమానికి సమస్యల పరిష్కారం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం ప్రతినిధులు కీసర గుట్టలో రెండు ఎకరాల భూమిని, శాశ్వత భవన నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులను ఇవ్వాలని, తమ ఈ విజ్ఞప్తిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. మూడేళ్లుగా అలాయ్– బలాయ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కుషాయిగూడ ముదిరాజ్ సంఘాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, ముదిరాజ్ సంఘం నాయకులు గణేష్ ముదిరాజ్, నగేష్ ముదిరాజ్, విజ య్ ముదిరాజ్ , కుషాయిగూడ ముదిరాజ్ సంఘం అ ధ్యక్ష కార్యదర్శులు పిట్టల నాగరాజు ముదిరాజ్, గద్దల పాండు ముదిరాజ్, ప్రేమ్ ముదిరాజ్ , శేఖర్ ముది రాజ్, యాదగిరి ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# ఊరుకుందామా.. ఉరికిద్దామా..?

**(మొదటిపేజీ తరువాయి)** కనిపిస్తోందని పేర్కొన్నారు. రసమయి బాలకిషన్ కూడా అలయ్ బలయ్ పేరిట తన పాటతో కాంగ్రెస్ మీద పోరాటానికి ఆయుధం విసరడం అభినందనీ యం అన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సయమంలో ధూం..ధాం.. తో ఎంతో జాగృతం చేశా డని, కాంగ్రెస్ మీద పోరాటానికి మరో ధూంధాం మొదలుపెట్టే రోజులు వచ్చాయన్నారు.

### మోసమే బహుమానం...

కాంగ్రెస్ సర్కార్ తీరుతో రైతులకే కాదు, దాదాపు అన్ని వర్గాల ప్రజలు మోసానికి గురవుతున్నారని హరీష్ పేర్కొన్నారు. ఎన్నికల వేళ సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలను తీసుకొచ్చి హామీలిచ్చిన రేవంత్ ఇప్పుడు మాత్రం వాటిని పూర్తిగా మరిచిపోతున్నారన్నారు. బతుకమ్మ పండుగ వేళ కేసీఆర్ చీరెలు ఇచ్చాడని, ప్రతి సెక్టార్ కు లబ్ధిచేకూరే పథకాలు ప్రవేశపెట్టారన్నారు. బీఆర్ఎస్ సర్కార్ పోయాక రేవంత్ వచ్చి అన్నింటిని అటకెక్కిస్తున్నాడన్నారు.

### ఎందుకివ్వడం లేదో చెప్పాలి

కేసీఆర్ రైతు భరోసా గా పదివేలు ఇచ్చాడని, దానికి తాము 15 వేలు ఇస్తామని గద్దెనెక్కిన రేవంత్ ఇప్పుడు ప్రజలను నట్టేటా ముంచారన్నారు. కరోనా సమయంలో కూడా కేసీఆర్ రైతుబంధు ఆపలేదని, నిధులకు ఇబ్బందిగా ఉంటే మంత్రులు, ఎమ్మెల్యేల జీతాలు ఆపి మరీ సమయానికి అన్నదాతకు అందజేశారన్నారు. రైతులను నిలువునా మోసం చేస్తున్న రేవంత్ పై కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు.

### సీఎంను ఏం చేద్దాం..

రైతు బంధు కింద 11 విడతల్లో 72వేల కోట్లు ఇచ్చిన కేసీఆర్ నమ్ముదామా.., లేదంటే రైతు వ్యతిరేకి రేవంత్ ను నమ్ముదామా.. అని ప్రశ్నించారు. మోసం చేస్తూ కాలం వెల్లదీస్తున్న సీఎంను ఏం చేయాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. రైతులు సంఘటితం కావాలని, గట్టిక పోరాటం చేయాలని, లేదంటే యాసంగి కూడా డబ్బులు ఎగ్గొట్టడం ఖాయమన్నారు.

### అన్నీ బందేనా..?

ఉన్న పథకాలను రేవంత్ బంద్ చేయించాడని హరీష్ దుయ్యబట్టారు. మహిళలకు 2500 అన్నడు.., ప్రతి మహిళకు 25వేల బాకీ పడ్డడు.., బతుకమ్మ చీరెలు అన్నడు, 500 ఇస్తడు అన్నడు ఎగ్గొ ట్టిండు.., వృద్ధులకు 4వేల పింఛన్ ఇస్తా అని మాట తప్పిడమే కాకుండా ఇచ్చే రెండు వేల పింఛన్ కూడా రెండు నెలలు ఎగ్గొట్టిం డు.., పింఛన్ల దగా.., రైతులకు బోనస్ ద గా.., రుణమాఫీ దగా.., తులం బంగారం దగా.., విద్యార్థులకు జాబ్స్ దగా.., మహిళలకు 2500 దగా.., అన్నీ దగా.. దగా.. గా మారుస్తున్నాడన్నారు. ఏనుముల రేవంత్ రెడ్డి అనాల్సిన అవసరం లేదని, ఎగవేతల రెడ్డి అనాలని, చీఫ్ మినిస్టర్ కాకుండా చీటింగ్ మ్యాన్ గా పిలుచుకోవాలని హరీష్ ఎద్దేవా చేశారు.

### అంతా బోగస్...

అన్ని పంటలకు బోనస్ అని మోసం చేసిండని, సన్నాలకు అని మాట మార్చి, ప్రభుత్వ సెంటర్ల వద్ద అమ్మితేనే ఆ బోనస్ ఇస్తా అంటున్నడన్నారు. మాటలెక్కువ చేతలు తక్కువగా సీఎం వ్యవహరిస్తున్నాడని, వర్షా లకు పత్తి దెబ్బ తిన్నదని, ఇప్పటి వరకు కొ నుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదన్నారు.

### కష్టాలు రెట్టింపు..

కాంగ్రెస్ వచ్చింది ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని హరీష్ రావు వివరించారు. రుణమాఫీ సగం కూడా కాలేదని సీఎం రాజీనామా చేస్తాడో తేల్చాలన్నారు. మానకొండూరులో ఏ ఊరుకు వస్తవో రా రేవంత్ రెడ్డి ఒక్క ఊర్లో అయినా రుణమాఫీ అయ్యిందా తేల్చుదాం అన్నారు. దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రికార్డు క్రియేట్ చేశాడన్నారు. తను యాదాద్రికి వెళ్లి పాపాత్ముడిని క్షమించు.., తెలంగాణ ప్రజలను కాపాడు అని దేవున్ని వేడుకుంటే అక్కడా తనపై కేసులు పెట్టించారని హరీష్ గుర్తు చేశారు.

### అంతా తూచ్..

రుణమాఫీ డిసెంబర్ 9 వరకు చేస్తానని సీఎం తాజాగా మరో డేట్ చెబుతున్నాడని, అది కూడా 3 లక్షల మందికే అని పేర్కొంటున్నాడని హరీష్ ఎద్దేవా చేశారు. లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు అనేది పెద్ద మోసమని, నిరుద్యోగ యువత పై అరాచకం చేస్తున్నారన్నారు దొం గలను కొట్టినట్లు నిరుద్యోగులను ఇష్టం ఉన్నట్లు కొడుతున్నారని, రాహుల్ గాంధీ లైబ్రరీ పోయి ఓట్లప్పుడు విద్యార్థులను బతిమిలాడారని, ఇప్పుడు ఎక్కడికి పోయారని నిలదీశారు.

### అర్థమయ్యేలా చెప్పాలి..

ఇప్పటికిప్పుడు లోకల్ బాడీ ఎన్నికలు పెట్టినా మానకొండూరులో బీఆర్ఎస్ వాళ్లే గెలుస్తారని, కాంగ్రెస్ వికృత వైఖరిపై గ్రామ గ్రామాన చర్చలు పెట్టాలని, ప్రజలు, రైతులు, యువత అందరికీ అర్థమయ్యేలా వివరించాలన్నారు. తనమీద, కేటీఆర్ మీద బుల్డోజర్లు ఎక్కిస్తా అంటున్నడని, తను చంపుతానని చెప్పినా భయపడేది లేదన్నారు.

### చూస్తూ ఊరుకోం..

పేదలకు అన్యాయం జరిగితే దేనికైనా మేం సిద్ధమని పేర్కొన్నారు. పేదల హామీలు అమలు చేసే దాకా రేవంత్ ను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నా రు. సమైక్య నాయకులతో, కర్కశ కాంగ్రెస్ తో కొట్లాడినామని, అలాంటిదిరేవంత్ ఎం తా అని వ్యంగ్యస్త్రాలు వేశారు. ఏనాడూ ఉ ద్యమం చేయలేదని, అమరవీరులకు శ్రద్ధాం జలి ఘటించలేదని, ఏదో లక్కీలాటరీగా ముఖ్యమంత్రి అయ్యేరా తప్ప, కష్టార్జితం ఏమీ కాదన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఇ చ్చిన హామీలు అమలు చేయాల ని, తప్పు లు ఎత్తిచూపడం ప్రతిపక్ష బాధ్యత అని హుందాగా స్వీకరించాలని సీఎంకు హితవు పలికారు.

# సీఎం చెంతకు 317 జీవో తుది నివేదిక..!

**జనపదం, హైదరాబాద్:** తెలంగాణలో వివాదాస్పద 317 జీవోపై కేబినెట్ సబ్ కమిటీ నివేదిక సర్కారుకు చేరింది. ఆదివారం మంత్రి దామోదర రాజనర్సింహ్మ నేతృత్వంలోని కమిటీ తుది నివేదికను సీఎం రేవంత్‌రెడ్డికి అందించింది. ఈ కార్యక్రమంలో కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లు పాల్గొన్నారు. అధికారంలోకి వచ్చీరాగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వివాదాస్పద జీవోపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఎన్నికల టైమ్‌లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోంది. అందుకోసం ప్రత్యేకంగా కేబినెట్ సబ్ కమిటీ వేసి.. సమస్యలను నివారించడంలో అనేక చర్యలు తీసుకుంది. జీవో 317 పై ఇప్పటికే పలుమార్లు భేటీ అయిన సబ్ కమిటీ, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలతో సమావేశాలు జరిపింది. ఇంతకీ 317 జీవోపై కమిటీ ఏం తేల్చింది..? ఎలాంటి నిర్ణయాలు తీసుకుంది..? నివేదికతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏం జరగనుందనే ఉత్కంఠ నెలకొంది. ఈ జీవోపై సీఎం త్వరలోనే అనుకూల నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# భర్త నిద్రిస్తుండగా మర్మాంగాలు కట్ చేసిన భార్య

*నాగర్ కర్నూల్ జిల్లాలో ఘటన*

**జనపదం, అచ్చంపేట:** నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలంలో భర్త నిద్రిస్తుండగా భార్య అతని మర్మాంగాలను కోసి వేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి (35) ఇంట్లో నిద్రిస్తుండగా అతని భార్య ప్రైవేట్ పార్ట్స్ కట్ చేసింది. అతడి అరుపులకు చుట్టూ పక్కల వారు వచ్చి వెంటనే గాయాల పాలైన బాధితుడిని లింగాల ఆసుపత్రి కి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రి కి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# నేటి నుంచి మెయిన్స్..

- పరీక్షా కేంద్రాల దగ్గర 144 సెక్షన్
- 46 కేంద్రాలు.. 31వేల మంది అభ్యర్థులు
- 96 శాతం హాల్ డికెట్లు డౌన్లోడ్
- తొలిసారిగా జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ
- మరోవైపు అభ్యర్థుల ఆందోళనలు
- అశోక్ నగర్ లో ఉద్రిక్తత
- భారీగా మోహరించిన పోలీసులు
- పరీక్షలపై ఉదయం మంత్రుల భేటీ

**జనపదం, హైదరాబాద్ బ్యూరో:** గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు టీజీపీఎస్సీ సర్వం సిద్ధం చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అభ్యర్థులందరి బయోమెట్రిక్ తీసుకోనుండగా కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రశ్నాపత్రం తరలించే వాహనానికి తొలిసారిగా జీపీఎస్ వినియోగించనున్నారు. మెయిన్స్ పరీక్ష వాయిదా కోసం ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు.

### 31,383 మంది అభ్యర్థులు..

రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి 27 వరకు గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించేందుకు గతంలోనే షెడ్యూల్ విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారమే నేటి నుంచి మెయిన్స్ పరీక్షలు మొదలుకానున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 46 పరీక్ష కేంద్రాల్లో 31,383 మంది హాజరు కానున్నారు. హైదరాబాద్‌లో 8, రంగారెడ్డిలో 11, మేడ్చల్ జిల్లాలో 27 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకు టీజీపీఎస్సీ ప్రత్యేకంగా సిబ్బందిని నియమించింది. పరీక్ష గది, చీఫ్ సూపరింటెండెంట్, పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి పరిస్థితులను సమీక్షిస్తున్నది. ఈనెల 21 నుంచి 27వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటికే పరీక్షా కేంద్రాలను పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు.

### పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు..

రాష్ట్రంలో గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలంటూ అభ్యర్థులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో నగర పోలీసులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశారు. వాయిదా వేయాలంటూ అభ్యర్థుల ఆందోళనలు తారస్థాయికి చేరడంతో పశ్నపత్రాల తరలింపు, పరీక్ష నిర్వహణ, జవాబు పత్రాలు తీసుకెళ్లడం వరకు ఎలాంటి ఆటంకం లేకుండా బందోబస్తు కల్పించాలని నిర్ణయించారు. ప్రతీ కేంద్రం వద్ద ఒక ఎస్ఐతో పాటు ఐదుగురు కానిస్టేబుళ్లు, ఒక మహిళా కానిస్టేబుల్ విధుల్లో ఉంటారు. అదనంగా ఒక పోలీస్ ఫ్లయింగ్ స్క్వాడ్ పరీక్షా కేంద్రాలను తరచూ సందర్శిస్తుంది. స్థానిక ఇన్‌స్పెక్టర్, ఏసీపీ పరీక్షా కేంద్రాలను సందర్శించి ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తుంటారు. భద్రతాపరమైన ఏర్పాట్ల పర్యవేక్షణకు మూడు కమిషనరేట్లలో ఒక్కో డీసీపీని నోడల్ అధికారిగా నియమించారు.



### తొలిసారిగా జీపీఎస్ ట్రాకింగ్

ప్రశ్నాపత్రాలు, జవాబు తరలించే వాహనాలకు టీజీపీఎస్సీ తొలిసారిగా జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ఉపయోగిస్తోంది. స్ట్రాంగ్ రూముల నుంచి పరీక్ష కేంద్రానికి తరలించే వాహనాలకు జీపీఎస్ అమర్చి టీజీపీఎస్సీ ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తారు. వాహనం ఒక్కనిమిషం ఆగినా వెంటనే గుర్తించి అప్రమత్తం చేసేలా ఏర్పాట్లు చేశారు. గ్రూప్–1 పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్‌నెట్ దుకాణాలు మూసివేయాలని పోలీసులు ఆదేశాలిచ్చారు. వాచీలు, కాలిక్యులేటర్లు, పేజర్లు, సెల్‌ఫోన్లు, పెన్‌డ్రైవ్, బ్లూటూత్ తదితర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేదు. మంగళసూత్రం, గాజులు మినహా ఆభరణాలను తేనివ్వరు. పరీక్షల కోసం అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.

### మార్గదర్శకాలు జారీ..

గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మేరకు ఆదివారం మరోసారి మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇప్పటికే 96 శాతం మంది అభ్యర్థులు తుది పరీక్షల కోసం హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకున్నారు. పోలీస్ కమిషనర్లతో ప్రభుత్వం తగిన బందోబస్తు ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రాల వద్ద స్వల్ప ఘటనలు జరుగకుండా అత్యంత అప్రమత్తంగా పరీక్షల నిర్వహణ నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. 2011 సంవత్సరం తర్వాత గ్రూప్ –1 మెయిన్స్ పరీక్షలు సోమవారం నుంచి జరగనున్నాయి. పరీక్షల నిర్వహణలో కచ్చితమైన నియమ నిబంధనలు పాటించేలా స్పష్టమైన మార్గదర్శకాలు పాటించేలా చర్యలు తీసుకున్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకోవడానికి ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా గంట సమయాన్ని అదనంగా కేటాయించారు. స్క్రైబ్ల సహాయంతో పరీక్షలు రాసే వారికి 4 కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### అశోక్ నగర్‌లో మళ్లీ ఆందోళన..

గ్రూప్ –1 మెయిన్స్ వాయిదా వేయాలని అభ్యర్థుల ఆందోళన కొనసాగుతున్నది. జీవో నెంబర్ 29 ను రద్దుచేసి తమకు న్యాయం జరిగేలా గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డికి అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. అశోక్ నగర్ చౌరస్తాకు పెద్ద ఎత్తున గ్రూప్స్ అభ్యర్థులు చేరుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యను పట్టించుకోవాలని రిక్వెస్ట్ చేస్తున్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ను తొలగించాలనేది జీవో 29 రద్దుకు ప్రధాన కారణంగా ఆరోపణలు చేస్తున్నారు. నిజానికి, తెలంగాణ వచ్చి పదేళ్లు పూర్తయినా ఒక్కసారి కూడా గ్రూప్ 1 ఉద్యోగాలు భర్తీ చేయలేదు. దాంతో గ్రూప్స్ ఉద్యోగాల కోసం చదువుతున్న అభ్యర్థుల తీవ్ర నిరాశలో ఉన్నారు. ఇదివరకే రెండు పర్యాయాలు గ్రూప్ 1 ప్రిలిమ్స్ ఎగ్జామ్ రద్దు చేశారు. మూడోసారి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రిలిమ్స్ నిర్వహించి, మెయిన్స్ కు టీజీపీఎస్సీ ఏర్పాట్లు చేస్తోంది. నేటి నుంచి వారం రోజులపాటు గ్రూప్ 1 మెయిన్స్ ఎగ్జామ్ నిర్వహించనున్నారు. అయితే జీవో నెంబర్ 29 వల్ల రిజర్వేషన్లు కోల్పోతున్నామని కొందరు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీసీ, ఎస్సీ అభ్యర్థులకు ఓపెన్ కేటగిరీలో ఉద్యోగాలు రావని అభ్యర్థులు చెబుతున్నారు. కాగా, గ్రూప్–1 అభ్యర్థులందరూ కలిసి అశోక్ నగర్‌లో ఆదివారం ప్రెస్ మీట్ పెట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై నిరుద్యోగులకు వివరించేందుకు అభ్యర్థులు ప్రయత్నించారు. గ్రూప్–1 నిర్వహించి తీరుతామని మొండిగా ముందుకు వెళ్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు అభ్యర్థులు సిద్ధం కాగా, వారిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. ఇక గాంధీ భవన్ ముట్టడికి బయల్దేరిన ఓయూ జేఏసీ నేత మోతిలాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతన్ని బొల్లారం పోలీసు స్టేషన్‌కు తరలించారు.

# అన్ని హంగులతో ఏటీసీ కేంద్రాలు..




- సత్వర ఉద్యోగ, ఉపాధిని అందించేలా అడ్వాన్స్ డ్ కోర్సులు...
- ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నాం.
- నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

**జనపదం, నిజామాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు అధునాతన హంగులతో అందుబాటులోకి రానున్నాయని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాల శాశ్వత భవన నిర్మాణాలు, శిక్షణా తరగతుల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నామని అన్నారు. ఏటీసీ లలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సత్వరమే ఉద్యోగ, ఉపాధి లభించేందుకు విరివిగా అవకాశాలు ఉన్నందున ప్రత్యేక ప్రాధాన్యత కనబరుస్తున్నామని తెలిపారు. టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్) కంపెనీ సహకారం, సమన్వయంతో యువతలో నైపుణ్యం పెంపొందించడం కోసం ఎన్సీవీటీ ఆమోదించిన పరిశ్రమ 4.0 ట్రేడ్‌లలో నైపుణ్య కోర్సులను ప్రవేశపెట్టడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలలో (ఐటిఐ) అధునాతన సాంకేతిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు.ఏటీసీ లలో అధునాతన కోర్సులను పూర్తి చేసిన తర్వాత విద్యార్థులకు క్యాంపస్ డ్రైవ్ (క్యాంపస్ ప్లేస్‌మెంట్స్) నిర్వహించబడుతుందని, డొమెస్టిక్ , మల్టీ–నేషనల్ కంపెనీల (ఎంఎన్సి) ద్వారా రిక్రూట్ చేయబడతారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో అప్రెంటిస్‌షిప్, ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని, టాటా మోటార్స్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, కిర్లోస్కర్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్ఏఎల్, లాక్‌హీడ్ మార్టిన్ యూఎస్ ఆధారిత కంపెనీ మొదలైన 100 కంటే ఎక్కువ కంపెనీలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించవచ్చని తెలిపారు. అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో నూతనంగా ప్రవేశపెట్టిన కొత్త కోర్సులను, వాటిని నేర్చుకుంటే కలిగే ఉపయోగాలను ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు.

**మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్**

ఈ కోర్సు కాల వ్యవధి 1 సంవత్సరం వుంటుంది. ప్రతి ఏటీసీ సెంటర్ లో సీట్ల సంఖ్య 40 వరకు వున్నాయి. ఈ కోర్సులో స్వయంచాలక తయారీ ప్రక్రియలు, నియంత్రణ వ్యవస్థలు, నాణ్యత నిర్వహణలో విద్యార్థులను నైపుణ్యంతో సన్నద్ధం చేయడం వంటివి ఉంటాయి. ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్ (పి ఎల్ సి సి ఎన్ సి ), పారిశ్రామిక ఆటోమేషన్ (సెన్సార్లు, యాక్యుయేటర్లు, నియంత్రణ వ్యవస్థలు), రోబోటిక్స్, మెకాట్రానిక్స్, ప్రోసెస్ కంట్రోల్ అండ్ మేనేజ్మెంట్, నాణ్యత నియంత్రణ, నిర్వహణ, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, న్యూమాటిక్స్, హైడ్రాలిక్స్ లో తర్ఫీదు ఇస్తారు. ఈ కోర్సు నేరుచుకున్న వారు ఆటోమేషన్ టెక్నీషియన్, ప్రాసెస్ కంట్రోల్ ఇంజనీర్, తయారీ ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్ ఇన్స్పెక్టర్, రోబోటిక్స్ మెయింటెనెన్స్ టెక్నీషియన్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రిషియన్, కంట్రోల్ సిస్టమ్ టెక్నీషియన్ గా స్థిరపడవచ్చు. ఆటోమోటివ్, ఏరోస్పేస్, ఫార్మాస్యూటికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, రసాయనాలు, టెక్స్ టైల్స్, చమురు, వాయువు పరిశ్రమలలో ఉద్యోగాలకు అవకాశం లభిస్తుంది.

**మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సు :**

దీని కాల వ్యవధి 2 సంవత్సరాలు, సీట్ల సంఖ్య 24 చొప్పున ఉన్నాయి. ఈ కోర్సులో ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ, మరమ్మత్తు మరియు ట్రబుల్ షూటింగ్లో విద్యార్థులను నైపుణ్యంతో సన్నద్ధం చేయడం వంటివి వుంటాయి. ఎలక్ట్రిక్ వెహికల్ ఆర్కిటెక్చర్, బ్యాటరీ నిర్వహణ వ్యవస్థలు, ఎలక్ట్రిక్ మోటార్ నియంత్రణ, పవర్ ఎలక్ట్రానిక్స్, ఛార్జింగ్ సిస్టమ్స్, భద్రతా ప్రోటోకాల్స్, ట్రబుల్ షూటింగ్, నిర్వహణ వుంటాయి. ఈ కోర్సు నేర్చుకున్న వారు ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నీషియన్ ఇ వి మెయింటెనెన్స్ ఇంజనీర్, బ్యాటరీ టెక్నీషియన్, ఛార్జింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ స్పెషలిస్ట్, ఇవి సర్వీస్ సెంటర్ మేనేజర్ వంటి ఉద్యోగాలు పొందవచ్చు. ఎలక్ట్రిక్ వెహికల్ తయారీ, ఇ వి సర్వీస్ సెంటర్లు, ఛార్జింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్, ఆటోమోటివ్ పరిశోధన – అభివృద్ధి, పునరుత్పాదక ఇంధన రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమలలో అవకాశాలను కల్పిస్తుంది.

**బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్**

ఈ కోర్సు కాల వ్యవధి 2 సంవత్సరాలు, సీట్ల సంఖ్య 24 చొప్పున ఉన్నాయి. కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్ సాఫ్ట్ వేర్ ను ఉపయోగించి మెకానికల్ డిజైన్, సిమ్యులేషన్, వెరిఫికేషన్ లో విద్యార్థులను నైపుణ్యంతో సన్నద్ధం చేయడం జరుగుతుందన్నారు. మెకానికల్ డిజైన్ ఫండమెంటల్స్, సిఎడి సాఫ్ట్వేర్ (సాలిడ్వర్క్స్, ఆటోడెస్క్ ఇన్వెంటర్), సి ఎ ఇ సాఫ్ట్వేర్ మోడలింగ్ – అనుకరణ, వర్చువల్ ధృవీకరణ, డిజైన్ ఫర్ మ్యానుఫ్యాక్చురబిలిటీ, రేఖాగణిత డైమెన్షనింగ్, టాలరెన్సింగ్ వంటివి వుంటాయి. ఈ కోర్సు నేర్చుకున్న వారు మెకానికల్ డిజైన్ ఇంజనీర్, డిజైన్ వెరిఫికేషన్ ఇంజనీర్, వర్చువల్ టెస్టింగ్ ఇంజనీర్, ఉత్పత్తి అభివృద్ధి ఇంజనీర్, తయారీ ఇంజనీర్ వంటి వాటికి అర్హులు. ఆటోమోటివ్, ఏరోస్పేస్, పారిశ్రామిక సామగ్రి, వినియోగ వస్తువులు, వైద్య పరికరాలు, శక్తి యుటిలిటీస్, నిర్మాణం వంటి పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందన్నారు.

**ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్**

ఈ కోర్సు కాలవ్యవధి 1 సంవత్సరం. సీట్ల సంఖ్య 20 చొప్పున ఉన్నాయి. ఈ కోర్సులో వివిధ హస్తకళలు, ట్రేడ్లలో క్లిష్టమైన డిజైన్లు, నమూనాలు ఉత్పత్తులను రూపొందించడానికి అధునాతన సాధనాలు, సాంకేతికతలను ఉపయోగించడంలో విద్యార్థులను నైపుణ్యంతో సన్నద్ధం చేయడం వంటివి ఉంటాయి. అధునాతన సాధనం నిర్వహణ, ప్రెసిషన్ క్రాఫ్టింగ్, ఫినిషింగ్ టెక్నిక్స్, డిజైన్ వివరణ, విజువలైజేషన్, మెటీరియల్ ఎంపిక, ప్రాసెసింగ్, భద్రతా ప్రోటోకాల్లు, వర్క్ షాప్ నిర్వహణ, కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్ సాఫ్ట్వేర్, 3డీ ప్రింటింగ్, మోడలింగ్. మాస్టర్ క్రాఫ్ట్స్ మాన్, టూల్ అండ్ డై మేకర్, ప్రెసిషన్ ఇన్స్ట్రుమెంట్ మేకర్, జ్యువెలరీ డిజైనర్ అండ్ మేకర్, ఫర్నిచర్ మేకర్ అండ్ రిస్టోరర్, శిల్పి – మోడల్ మేకర్, ఉత్పత్తి డిజైనర్ వంటి ఉద్యోగాలకు అర్హులు. క్రాఫ్ట్, హస్తకళలు, ఆభరణాలు, వాచ్ మేకింగ్, ఫ ర్నిచర్, చెక్క పని, శిల్పం తయారీ, ప్రెసిషన్ ఇన్స్ట్రుమెంటేషన్, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్, ఆటోమోటివ్ ఇండస్ట్రియల్ వంటి వాటిలో ఉద్యోగాలకు అవకాశాలను కల్పిస్తుందన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులు అయిన వారు ఆయా కోర్సులలో నేరుగా చేరవచ్చని కలెక్టర్ సూచించారు. తొలి విడతగా జిల్లాలోని నిజామాబాద్ ప్రభుత్వ బాలుర ఐటీఐ, బోధన్, కమ్మర్పల్లి ప్రభుత్వ ఐ.టీ.ఐలలో ఈ నెలాఖరు లోపు ఇంటర్వ్యూకు హాజరై ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు.



# చికెన్ బిర్యానీలో కప్ప

- ట్రిపుల్ ఐటీ మెస్‌లో కలకలం
- సోషల్ మీడియాలో వైరల్

**జనపదం, హైదరాబాద్ సిటీ :** ట్రిపుల్ ఐటీ మెస్‌లో పెట్టిన చికెన్ బిర్యానీలో చచ్చిన కప్ప ప్రత్యక్షం కావడం విద్యార్థులను తీవ్ర ఆందోళనకు గురిచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీలోని కదంబ మెస్‌లో విద్యార్థులకు ఇటీవల పెట్టిన చికెన్ బిర్యానీలో కప్ప కళేబరం కనిపించింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మెస్ నిర్వాహకులు నిర్లక్ష్యమే దీనికి కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మెస్ ఇంఛార్జీకి ఫిర్యాదు చేశారు. బిర్యానీలో చనిపోయిన కప్ప ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయగా వైరల్ అవుతున్నాయి. ఈ నెల 16న జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా, ఈ విషయాన్ని తెలంగాణ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు విద్యార్థులు తెలిపారు.




# ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ కు మద్దతు

- సంస్కృత ఉపన్యాసక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్

**జనపదం, సిద్దిపేట :** ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ కు సంస్కృత ఉపన్యాసక సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, మృత్యుంజయ శర్మ తెలిపారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఒక రూపాయి మేయర్ గా ప్రసిద్ధి చెందిన కరీంనగర్ మాజీ మేయర్ విద్యావంతుడు సర్దార్ రవీందర్ సింగ్ సంస్కృత భాషకు ఇంటర్లో ఉపద్రవం వచ్చిన సందర్భంలో కరీంనగర్ లో సంస్కృత శంఖారావం ఏర్పాటు చేసిన విషయం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించారన్నారు. రవీందర్ సింగ్ నిరుద్యోగుల పట్టభద్రుల సమస్యలపై పోరాటం చేయగల సమర్థత కలిగిన వ్యక్తి అన్నారు. రాబోయే రోజుల్లో శాసన మండలి సభ్యులుగా గెలిపిస్తే నిరుద్యోగుల గొంతుకై ప్రభుత్వాన్ని ప్రశ్నించగల సత్తా రవీందర్ సింగ్ కు ఉందన్నారు. అందుకే సంస్కృత ఉపన్యాసక సంఘం నాలుగు వేల ఉపన్యాసకులు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సంపత్, గౌరవ సలహాదారులు సురేష్, తిరుపతి, గణేష్, సుశీల్, రాజేష్, నాగరాజు, సిరిసిల్ల కౌన్సిలర్ భాస్కర్, నరసింహా చారి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ టు యాదాద్రి


- ఎంఎంటీఎస్ సర్వీసులు
- త్వరలోనే పనులు ప్రారంభం
- సిద్ధంగా చర్లపల్లి రైల్వే టెర్మినల్
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**జనపదం, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ సర్వీస్ ను పొడిగిస్తున్నామని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తి చేశామని, త్వరలోనే పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఈ సర్వీసు భక్తులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. హైదరాబాద్ నుంచి కొమురవెల్లి మల్లన్న పుణ్యక్షేత్రం వరకు కూడా రైల్వే స్టేషన్ ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఆ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. రైల్వే లెవెల్ క్రాసింగ్ లు ప్రమాదకరంగా ఉండకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. 268 ఆర్ యూబీలు, అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలు, 42 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మాణం పూర్తి చేశామన్నారు. ప్రయాణికుల భద్రత కోసం అన్ని రైల్వే స్టేషన్లలో సీసీ కెమెరాల ఏర్పాటు చేశామని, తెలంగాణలో 176 రైల్వే స్టేషన్ లలో హై స్పీడ్ వైఫై సౌకర్యాన్ని కల్పించామని అన్నారు. వివిధ రైల్వే స్టేషన్ లలో 86 స్టాల్స్ స్థానిక ఉత్పత్తులను ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న చర్లపల్లి రైల్వే టెర్మినల్ ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ చర్లపల్లి రైల్వే స్టేషన్ ను స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీతో నిర్మాణం చేశామన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి తెలంగాణకు రైల్వేల విషయంలో అన్యాయం జరిగిందన్నారు. నూతన రైల్వే లైన్ల నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని తెలిపారు. ఇప్పటికే హైదారాబాద్ లో సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడతోపాటు అదనంగా చర్లపల్లిని నాలుగో నూతన రైల్వే స్టేషన్ గా రాబోతుందని తెలిపారు. దీనికారణంగా హైదారాబాద్ లో ట్రాఫిక్ తగ్గుతుందని తెలిపారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ ను 430 కోట్ల రూపాయాలు ఖర్చు చేసి నిర్మించామన్నారు. రైల్వే ట్రాక్ నిర్మాణంతో పాటు కొత్త టెక్నాలజీతో అన్ని సదుపాయాలు కల్పించామని తెలిపారు. దివ్యాంగులకు, వృద్దులకు మెట్లు ఎక్కడానికి ఎస్కలెటర్లు, లిఫ్ట్ లు ఏర్పాటు చేశామన్నారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ నుండి వెళ్లడానికి కనెక్టివిటీ రోడ్లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. భరత్ నగర్, మహాలక్ష్మీ నగర్ వైపున 80 అడుగుల మేర రోడ్లు కావాలని, రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలన్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం మాష్టర్ ప్లాన్ తయారు చేసిందని, వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పూర్తి స్థాయిలో ఇక్కడ నుండి రోడ్లు కనెక్టివిటీ ఉంటేనే ఉపయోగం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో చర్లపల్లి టెర్మినల్ ను తక్కువ సమయంలో నిర్మించామని, ఇప్పటికే 98 శాతం పనులు పూర్తి చేశామన్నారు. తెలంగాణలో రైల్వే ప్రమాదాలు జగకుండా ఉండేందుకు కవచ్ వ్యవస్థను తెలంగాణలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టామని తెలిపారు. వందేభారత్ రైళ్లు డిల్లీ తర్వాత తెలంగాణలోనే ఎక్కువగా ఉన్నాయన్నారు. త్వరలో వందే భారత్ ట్రెయిన్ లలో స్లీపర్ కోచ్ లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణలో అమృత్ పథకం కింద 40 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దాదాపు రూ. 715 కోట్లతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ను, రూ. 429 కోట్లతో నాంపల్లి రైల్వే స్టేషన్ ను, రూ. 430 కోట్లతో చర్లపల్లి రైల్వే స్టేషన్ లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రూ. 521 కోట్లతో రైల్ నిర్మాణ యూనిట్ ను ప్రారంభించామన్నారు. 346 కిలోమీటరు మేరకు తెలంగాణలో రైల్వే లైన్లు నిర్ణయించామన్నారు. 369 కిలోమీటర్ల మేర సింగిల్, డబుల్ లైన్లను నిర్ణయించామన్నారు. త్వరలోనే యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

# సేవకు ప్రతిబింబాలు ఆర్యవైశ్యులు

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- ఘనంగా మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రమాణ స్వీకార మహోత్సవం
- హాజరైన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



**జనపదం, మేడ్చల్ :** ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాలకు ప్రతిబింబాలుగా నిలుస్తారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కొనియాడారు. ఆదివారం కీసరలోని కేబీఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఏ పని చేసిన అంకుటిత దీక్షతో చేస్తారని, అవే వారి విజయాలకు కారణమవుతాయని తెలిపారు. ఆర్య వైశ్యులకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, వారు ఆదర్శంగా ఉంటూ ఇతరులకు మేలు చేస్తారన్నారు. మానవసేవే మాధవసేవ అన్నట్టుగా వైశ్య కుటుంబాలు విరాళాలు ఇస్తుంటారని, భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరింత చేపట్టాలని ఆకాంక్షించారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆర్యవైశ్యులకు సంఘాలు చేదోడుగా ఉంటూ ఆదుకుంటే వారి పిల్లల చదువులకు, భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ వైశ్యుల సహాయ సహకారాలతోనే ప్రతి గ్రామంలో సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని, వైశ్యులతోనే తాము అభివృద్ధి బాటలోకి వచ్చామని, మల్లారెడ్డి గార్డెన్స్ లో వారి ఆర్థిక సాయం ఎంతో ఉందన్నారు. ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ఉంటూ రాజకీయాల్లోకి సైతం రాణించాలని కోరారు. మేడ్చల్ జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాలు భవిష్యత్తులో 14 నియోజకవర్గాలుగా మారనున్నాయని, గ్రేటర్ హైదరాబాదులోని 150 డివిజన్లు 400 డివిజన్లుగా ఏర్పడనున్నాయని, కార్పొరేటర్లు, మేయర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు అయ్యే అవకాశం కల్పించుకోవాలని సూచించారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ గుప్తా మాట్లాడుతూ ఉన్నతంగా జీవిస్తూ అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. మాజీ రాజ్యసభ సభ్యుడు గిరీష్ కుమార్ సంఘీ గుప్తా మాట్లాడుతూ సంఘాల ఏర్పాటుతో వైశ్యులంతా ఏకతాటిపైకి రావాలని అన్నారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పార్శి ప్రకాష్ గుప్తా మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిందని, సంఘం తరఫున సుమారు 30 లక్షల రూపాయలు విరాళాలు అందజేసినట్లు తెలిపారు. మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్ష కార్యదర్శులు బెల్డి రమేష్ గుప్తా,బచ్చు నగేష్ గుప్తా మాట్లాడుతూ జిల్లాలోని ఆర్యవైశ్యుల అభ్యున్నతికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నేతి రాముల గుప్తా, రేణిగుంట్ల గణేష్ గుప్తా, చింతల రవికుమార్ గుప్తా, ఉప్పల శారద గుప్తా, అర్థం లక్ష్మయ్య గుప్తా, బచ్చు విలాస్ గుప్తా, కొండే మల్లికార్జున గుప్తా, ఇరుకుల రామకృష్ణా గుప్తా, అగిర్ వెంకటేష్ గుప్తా, తాళ్లపల్లి బాలేశ్వర్ గుప్తా, గంప శ్రీనివాస్ గుప్తా, పసుపునూరి హరినాథ్ గుప్తా, గన్ను తిరుపతయ్య గుప్తా, తాడేపల్లి వెంకటేశం గుప్తా, చందా నాగభూషణం గుప్తా, పెద్ది నాగరాజు గుప్తా, కటకం శివకుమార్ గుప్తా, చింతా బాలయ్య గుప్తా, సముద్రాల హరినాథ్ గుప్తా, బల్లి శ్రీనివాస్ గుప్తా, సముద్రాల నవీన్ గుప్త, బల్లి శ్రీధర్ గుప్తా, జిల్లాలోని వివిధ మండలాల ఆర్యవైశ్య సంఘాల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



# దశాబ్ది ఉత్సవాలకు రండి..

- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కి మలేషియా తెలంగాణ అసోసియేషన్ ఆహ్వానం

**జనపదం, హైదరాబాద్ :** మలేషియా తెలంగాణ అసోసియేషన్ పదేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను హాజరుకావాలని కోరుతూ అసోసియేషన్ ఆహ్వానించింది. వచ్చే నవంబర్ 9వ తేదీన మలేషియాలోని కౌలాలంపూర్ లో జరిగే ఈ దశాబ్ది ఉత్సవాలకి మలేషియాలోని తెలంగాణ వాసులు పెద్ద ఎత్తున హాజరవుతారని తెలిపింది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ లోని నంది నగర్ కేటీఆర్ నివాసంలో మలేషియా తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం కేటీఆర్ ని కలిసి ఆహ్వానం అందించారు. కేవలం మలేషియాలోని తెలంగాణ వాసులే కాకుండా అనేక దేశాల నుంచి ఈ ఉత్సవాలకు ప్రత్యేకంగా తెలంగాణ ప్రముఖులు హాజరు కానున్నారని కేటీఆర్ కి తెలియజేశారు. తెలంగాణ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాలకు ఆహ్వానించినందుకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ వెళ్లిన ఏ దేశం వెళ్లిన తెలంగాణ ప్రాంతీయులు రాష్ట్రం పట్ల తెలంగాణ ప్రజల పట్ల ఉన్న అనుబంధాన్ని కొనసాగిస్తున్నారని కేటీఆర్ గుర్తు చేశారు. మలేషియాలోనూ తెలంగాణ వాసులు తమకంటూ ఒక ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసుకొని అనేక రకాల కార్యక్రమాల్లో తెలంగాణ గడ్డతో మమేకం కావడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ ప్రస్థానంలో 10 సంవత్సరాల మైలురాయిని విజయవంతంగా పూర్తి చేసుకున్న మలేషియా తెలంగాణ అసోసియేషన్ కి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు కార్తీక్ రెడ్డి, రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నాయకా.. న్యాయం చేయండి..

- ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన వర్శిటీ లెక్చరర్లు..
- కాంట్రాక్టు ప్రొఫెసర్లుగా గుర్తించాలని వినతి...
- వేతనాల పెంపుకు డిమాండ్
- వర్సిటీల్లో అసమానతలపై ఫిర్యాదు

**జనపదం, నిజామాబాద్ :** అరకొర వేతనాలతో కొన్నేళ్లుగా యూనివర్సిటీల్లో పని చేస్తున్న తమను కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ యూనివర్సిటీ పార్ట్ టైం లెక్చరర్స్ అసోసియేషన్ ఎమ్మెల్సీ కోదండరాంకు వినతి పత్రం అందజేశారు. ఆదివారం అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ ప్రసన్న ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్సీ కోదండరాంను కలిశారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్ లో జరిగిన రాజకీయ జేఏసీ సమావేశంలో వినతి పత్రం సమర్పించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మినిమం టైం స్కేల్ కల్పిస్తూ, వెంటనే అమలు చేయాలని కోరారు. విద్యార్హతలు ఉన్నప్పటికీ, సమాన పనికి సమాన వేతనం అమలు కావడంలేదని వాపోయారు. నిత్యావసర ధరలు నింగినంటిన ప్రస్తుత సమయంలో, ఓ పీరియడ్ కు కేవలం రూ.700 మాత్రమే చెల్లిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యూనివర్సిటీల్లో పార్ట్ టైం లెక్చరర్లను చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన చెందారు. తమను కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా గుర్తించినప్పుడే అసమానతలు తొలగుతాయని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో సైతం తమ పార్ట్ టైం లెక్చరర్స్ అసోసియేషన్ కదం తొక్కిందని, మీతో కలిసి నడిచిందని గుర్తు చేశారు. ఓ ప్రొఫెసర్ గా, రాజకీయ జేఏసీ చైర్మన్ గా, ఎమ్మెల్సీగా, విద్యావేత్తగా, టీజేఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షునిగా, ప్రభుత్వ మిత్ర పక్ష నేతగా తమ బాధను అర్థం చేసుకొని సమస్య పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్సీ కోదండరాం న్యాయం చేస్తానని వారికి హామీ ఇచ్చారు. పార్ట్ టైం లెక్చరర్ల సమస్యలు తన దృష్టిలో ఉన్నాయని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి, తొందరలోనే న్యాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్ట్ టైం లెక్చరర్ల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు అరిగెల హరిత, కోశాధికారి కొట్టూరి గంగాధర్, నాయకులు, లెక్చరర్లు పాల్గొన్నారు.



# పెద్దపల్లి అభివృద్దే ధ్యేయం ..

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**జనపదం, పెద్దపల్లి :** పెద్దపల్లి నియోజవర్గ అభివృద్దే ధ్యేయమని ఎమ్మెల్యే విజయరమణ రావు అన్నారు. ఆదివారం పెద్దపల్లి పట్టణంలోని 19, 23 వార్డులో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.1,45,50,000 తో చేపట్టిన పలు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, షెడ్, కాంపౌండ్ వాల్ నూతన నిర్మాణాలకు స్థానిక కౌన్సిలర్లు, వార్డు ప్రజలతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణ సుందరీకరణ, పరిశుభ్రతకు ప్రజలంతా సహకరించాలన్నారు. పట్టణంలో నూతన అభివృద్ధి కార్యక్రమాల నిర్మాణాల నాణ్యత విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని కాంట్రాక్టర్లకు సూచించారు. అలాగే అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. వార్డులో పర్యటించినప్పుడు మహిళలు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని, ప్రాధాన్యతా క్రమంలో వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గత పాలకుల హయంలో పెద్దపల్లి పట్టణాన్ని అధ్వానమైన స్థితికి తీసుకొచ్చారని, ప్రజా పాలనలో సమస్యలను పరిష్కరించి, సుందరంగా తీర్చదిద్దుతామని హామీ ఇచ్చారు. కాగా పెద్దపల్లి పట్టణంలోని చందపల్లిలో శ్రీ భూలక్ష్మి మహాలక్ష్మి గ్రామశిల (బొడ్రాయి), పోచమ్మతల్లి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్, పలు వార్డుల ప్రజలు, చందపల్లి ప్రజలు, మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరసనకారులపై లాఠీచార్జ్ సరికాదు..

- పోలీసుల దమనకాండ కాంగ్రెస్ దురహంకారానికి నిదర్శనం
- బీఆర్ఎస్, కాంగ్రెస్ విధానాలు ఒక్కటే
- హిందూ వ్యతిరేకిగా సీఎం వ్యవహారం..
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**జనపదం, హైదరాబాద్ సిటీ:** సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంలోని అమ్మవారి విగ్రహం ధ్వంసం విషయమై నిరసన తెలుపుతున్న హిందువులపై పోలీసుల లాఠీచార్జ్ సహించరానిదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. హిందూ సంఘాలపై పోలీసుల దౌర్జన్య దమనకాండ, అశోక్ నగర్ లో నిరుద్యోగులు, విద్యార్థులపై లాఠీచార్జ్ కాంగ్రెస్ ప్రభుత్వ అహంకార ధోరణి, దురహంకారానికి నిదర్శనాలని మండిపడ్డారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో కిషన్ రెడ్డి మాట్లాడారు నిరుద్యోగ యువకులు వారం రోజులుగా అశోక్ నగర్ లో నిరసన కార్యక్రమాలు చేపడితే సీఎం రేవంత్ రెడ్డి మాటలు చేతలు దాటుతున్నాయే తప్ప సచివాలయం గేటు దాటటడం లేదని ఆరోపించారు. నిరుద్యోగ, రైతాంగ, పేదలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు, ఎన్నికలలో హామీలు ఏ ఒక్కటి సచివాలయం గేటు దాటడం లేదన్నారు.

**హిందూ వ్యతిరేకిగా సీఎం..**

సీఎం రేవంత్ రెడ్డి పూర్తి హిందూ వ్యతిరేక వైఖరిని అవలంబిస్తున్నారని ఆరోపించారు. వినాయక చవితి, బోనాలు, దేవీ నవరాత్రుల సందర్భంగా అనేకమందిపై కేసులు పెట్టించారన్నారు. డీజేలు, సౌండ్లు, మండపాల నిర్వాహకులను వేధించి అక్రమ కేసులు పెట్టారని మండిపడ్డారు. అన్యమతస్థులకు సంబంధించిన ప్రార్థన కేంద్రాల్లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వస్తున్న శబ్దాలు పోలీసులకు, ముఖ్యమంత్రికి వినబడవా..? అని నిలదీశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు అక్కడ మతపరమైన శిక్షణ పొంది అన్యమతస్థులను వేధించే విధంగా హిందూ దేవాలయంపై ఒక వ్యక్తి దాడి చేస్తే సీఎం రేవంత్, కాంగ్రెస్ పార్టీ ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. ముత్యాలమ్మ నిరసనకారులపై ఎందుకంత పాశవికంగా దాడి చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఒక కార్యకర్తకు 9 కుట్లు పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు అతన్ని ఇంట్లో వదిలివెళ్లారని, కానీ తాము పరామర్శించి అతని పరిస్థితి విషమిస్తుండడంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నామని చెప్పారు. దేవాలయంలోనే హిందువుల రక్తాభిషేకం చేస్తారా? అని మండిపడ్డారు. వీరంతా ఏమైనా టెర్రరిస్టులా అని ప్రశ్నించారు. దేవాలయ ధ్వంసం వంటి వీడియోలు చూసిన ఏ హిందువుకైనా ఆగ్రహం రాకుండా, ఆక్రోశం రాకుండా ఉంటుందా? అని ప్రశ్నించారు. అసలు మోటివేషన్ క్లాసుల పేరుతో ఎంతోమంది గుడిపక్కనే హిందూ వ్యతిరేక విధానాలకు పాల్పడుతుంటే పోలీసులు, ప్రభుత్వం ఏం చేస్తుందని కిషన్ రెడ్డి నిలదీశారు.





# ఎక్కడా అన్యాయం జరగదు..

- గ్రూప్ -1 అభ్యర్థులు పరీక్షలు రాయండి
- జీవో నెంబర్ 29తో నష్టం లేదు
- ఇంటర్ ఫలితాలు ఇవ్వలేని బీఆర్ఎస్ గ్రూప్స్ పై మాట్లాడడం విడ్డూరం..
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**జనపదం, హైదరాబాద్ సిటీ:** గ్రూప్ –1 సెలక్షన్ ప్రక్రియలో రిజర్వుడు కేటగిరి అభ్యర్థులకు అన్యాయం జరగదని టీపీపీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ భరోసా ఇచ్చారు. అభ్యర్థులందరూ ఆందోళనలు చెందకుండా మెయిన్స్ పరీక్షలు రాయాలని విజ్ఞప్తి చేశారు. జీవో నెంబర్ 29తో ఎవరికి ఎలాంటి నష్టం ఉండదని భరోసా కల్పించారు. ఈ మేరకు ఆదివారం గాంధీభవన్ లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. గ్రూప్ 1 పరీక్ష పై బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై లేనిపోని అనుమానాలు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. ఏ ముఖం పెట్టుకుని బీజేపీ ధర్నాలు చేస్తోందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ నియామకాల పేరుతోనే అధికారంలోకి వచ్చిందనే విషయాన్ని మర్చిపోయిందని ఎద్దేవా చేశారు. పదేళ్లలో టీఎస్పీఎస్సీ నుంచి ఎన్ని ఉద్యోగాలను బీఆర్ఎస్ ఇచ్చిందని నిలదీశారు. అప్పట్లో ఇంటర్మీడియేట్ ఫలితాలను సరిగా ఇవ్వలేని బీఆర్ఎస్ పార్టీ నేతలు పరీక్షలు గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేండ్లలో బీఆర్ఎస్ కేవలం 35 వేల ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే 50 వేల ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. ఇన్నాళ్లు ఉద్యోగాలు ఇవ్వని బీఆర్ఎస్ నేతలు ధర్నాలు చేయడం సిగ్గుచేటని మహేష్ కుమార్ గౌడ్ దుయ్యబట్టారు.



# అవ్వి కూల్చి.. ఇవ్విచ్చాడు..

- సీఎం రేవంత్ మూసీలో ఇండ్లు కూలగొట్టారు..
- కేసీఆర్ కట్టించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంచారు..
- మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ బాధితులపై ప్రభుత్వానిది కపట ప్రేమ
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

**జనపదం, హైదరాబాద్ సిటీ:** రేవంత్ రెడ్డి మూసీలో ఇండ్లు కూలగొట్టి కేసీఆర్ కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ఆదివారం గజ్వేల్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు మల్లన్నసాగర్, కొండ పోచమ్మ బాధితులపై కపట ప్రేమ చూపిస్తున్నారన్నారు. పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇస్తానని గొప్పగా చెప్తున్నాడన్నారు. తాము మల్లన్న సాగర్, కొండపోచమ్మ బాధితులకు పాత ఇండ్లకు 694 కోట్లు, యజమానికి ఉపాధి కింద 7. 50 లక్షలు, పెళ్లికాని పిల్లలకు 5 లక్షలు, 250 గజాల స్థలం, అన్ని వసతులతో కూడిన డబుల్ బెడ్రూమ్, గజ్వేల్ పట్టణ నడిబొడ్డున ఇచ్చామన్నారు. కానీ సీఎం మూసీల ఇండ్లు కూల్చి, కేసీఆర్ కట్టించిన డబుల్ బెడ్రూమ్ ఇచ్చాడని ఎద్దేవా చేశారు.

**డబుల్ బెడ్రూమ్ కట్టివ్వాలి..**

కేసీఆర్ భూ నిర్వాసితులకు డబుల్ బెడ్రూమ్ కట్టి ఇచ్చినట్టు రేవంత్ రెడ్డి కూడా ఇండ్లు కట్టివాలన్నారు. మూసీ బాధితులకు గచ్చిబౌలిలో 250 గజాల ఇల్లు కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మల్లన్న సాగర్ లో కేసీఆర్ అన్యాయం చేసిండా లేక మూసీలో రేవంత్ అన్యాయం చేస్తుండా ప్రజలు గమనిస్తున్నారన్నారు. 675 ఎకరాలలో దేశంలో నెంబర్ వన్ అర్ అండ్ అర్ కాలనీ నిర్మించి ఇచ్చామని, పేదల కోసం కేసీఆర్ డబల్ బెడ్రూమ్ ఇండ్లు కట్టి ఇస్తే మూసీ బాధితులకు ఇచ్చి రేవంత్ డబ్బా కొట్టు కుంటున్నాడన్నారు.

**అబద్ధాల సీఎం రేవంత్..**

మల్లన్న సాగర్ భూ నిర్వాసితులకు బీఆర్ఎస్ డబల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వలేదని రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నాడన్నారు. 3414 గజ్వేల్ లో డబల్ బెడ్రూమ్ ఇండ్లు కట్టి ఇచ్చిన విషయాన్ని గమనించాలన్నారు. గచ్చి బౌలి లో 470 ఎకరాల్లో ఉన్నా భూమిలో మూసీ బాధితులకు కట్టి ఇవ్వాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వచ్చి ఏడాది అయిన మల్లన్న సాగర్ నిర్వాసితులకు రూపాయి అయిన ఇచ్చారా అని ప్రశ్నించారు. సొల్లు వాగుడు , అబద్ధాలు, గొబెల్స్ ప్రచారం ఎందుకని నిలదీశారు. వర్గల్ మండలంలో పరిశ్రమలు రాకుండా కాంగ్రెసోళ్లు అడ్డు పడుతున్నారని, ఆ రోజు కోర్టులలో ఉండి ప్రాజెక్ట్ లను అడ్డుకొని ఈ రోజు రూపాయి ఇవ్వకుండా అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా మిగిలిన మల్లన్న సాగర్ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.


# భయపడకండి..

- అనుమతులుంటే కూల్చం..
- సీఎం ఆదేశాలకు కట్టుబడి ఉన్నాం
- చట్టబద్ధమైన పర్మిషన్లున్న వెంచర్లను ముట్టుకోం
- చెరువుల వద్ద నిర్మాణాలపై హైడ్రా ప్రకటన

**జనపదం, హైదరాబాద్ సిటీ:** చెరువుల ఆక్రమణల తొలగింపుపై ఎప్పుడు బుల్డోజర్లు వస్తాయనే భయంతో ఉన్న నిర్మాణదారులకు హైడ్రా మరో కీలక ప్రకటన విడుదల చేసింది. ఆక్రమణల వ్యవహారంలో హైడ్రా తీసుకునే నిర్ణయాలు ఇటీవల కీలకంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్‌కు భరోసా కల్పించేలా శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలపై హైడ్రా కమిషనర్ తాజాగా స్పందించారు. నగరంలో కూల్చివేతలపై కీలక ప్రకటన విడుదల చేశారు. చట్టబద్ధమైన అనుమతులున్న వెంచర్ల విషయంలో భయపడాల్సిన అవసరం లేదని రంగనాథ్ వెల్లడించారు. చెరువుల వద్ద అనుమతులున్న నిర్మాణాలు కూల్చివేస్తారని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. చెల్లుబాటు అయ్యే అనుమతులున్న నిర్మాణాలు కూల్చివేయబోమని వెల్లడించారు. కాగా, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగాన్ని దెబ్బతీయడానికి, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక మూలాలను అస్థిరం చేయడానికి బీఆర్ఎస్, బీజేపీ కుట్రలు చేస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. శనివారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు, నాలాలను కబ్జా చేసినవారికి 'హైడ్రా' ఒక భూతం లాంటిదన్నారు. వారి పట్ల ఒక హైడ్రా అంకుశం లాగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తమ ఫామ్ హౌజ్‌లను కాపాడుకోడానికే పేదలను అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం చట్టబద్ధమైన నిర్మాణాల జోలికి వెళ్లకుండా హైడ్రాకు ఆదేశాలిస్తున్నట్లు చెప్పారు.

**సీఎం ఆదేశాలు పాటిస్తాం..**

సీఎం రేవంత్ కామెంట్స్, ఆదేశాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చట్టబద్ధమైన అనుమతులతో వెంచర్లు ఏర్పాటు చేసుకున్నవారు హైడ్రా కూల్చివేతలకు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. చెరువులకు సమీపంలో అనుమతులు ఉన్నా నిర్మాణాలు కూల్చివేస్తారని హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. చెరువులకు సమీపంలో ఉన్న నిర్మాణాలకు అన్ని అనుమతులు సక్రమంగా ఉంటే కూల్చివేయమని సీఎం చెప్పారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలకు హైడ్రా కట్టుబడి ఉంటుందని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. కాగా, హైడ్రా పరిధిని ఇటీవల విస్తరించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపలి వరకు హైడ్రా పరిధిని విస్తరించారు. ప్రస్తుతం హైడ్రా కూల్చివేతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఓఆర్ఆర్ పరిధిలోని చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిని నిర్ధారించిన తర్వాత కూల్చివేతలు చేపట్టనున్నట్లు తెలిసింది. అందుకు మరో మూడు నెలల సమయం పట్టనుండగా అప్పటి వరకు కూల్చివేతలు ఉండవని ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నారు. ఇక హైదరాబాద్ నగరంలోని ట్రాఫిక్ కంట్రోల్‌కు హైడ్రాను భాగస్వామ్యం చేయనున్నారు. హైడ్రా సిబ్బందిని వినియోగించుకోనున్నారు. వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి ట్రాఫిక్ కంట్రోల్‌కు వాడుకోనున్నారు.




# కుల గణనకు 60 ప్రశ్నలు

- ఎక్కడుంటున్నారు.. ఏం తింటున్నారు..?
- గతంలో సంక్షేమ పథకాలపైనా ఆరా
- 1.10 కోట్ల కుటుంబాల నుంచి వివరాలు సేకరణ
- 3 వేలకుపైగా సిబ్బంది
- 15 రోజులు క్షేత్రస్థాయి సర్వే
- ఆ తర్వాత నివేదికలు
- నెలాఖరులోగా కుల గణన సర్వేకు వెళ్లేందుకు చాన్స్

**జనపదం, హైదరాబాద్ బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం కుల గణనకు సిద్ధమవుతోంది. రాష్ట్రంలో ఉన్న జనాభా ఆధారంగా ఏ కులం జనాభా సంఖ్య ఏ మేరకు ఉంది? వారికి అందుతున్న సంక్షేమ పథకాలు.....ఇంకా అందించాల్సిన పథకాలు ఏమైనా ఉన్నాయా? తదితర అంశాలపై ఫోకస్ చేస్తూ త్వరలోనే సమగ్ర కులగణనను చేపట్టాలని భావి స్తోంది. ఈ మేరకు తగు ప్రణాళికలు సైతం సిద్ధమయ్యాయి. అన్నీ అనుకూలిస్తే ఈ నెలాఖరు నుంచే ఈ కార్యక్రమం మొదలయ్యే అవకాశముందని తెలుస్తోంది. ఇందుకు అవసరమైన 3వేల సిబ్బందికి ఇప్పటికే తగు శిక్షణ కూడా పూర్తి చేసింది. కాగా ఈ గణన సందర్భంగా తర్ఫీదు పొందిన సిబ్బంది 15 రోజుల పాటు క్షేత్ర స్థాయిలోనే ఉండనున్నారు. ప్రజలకు సంబంధించిన అన్ని వివరాలను సేకరించనున్నారు. ఇలా రాష్ట్రంలోని 1.10 కుటుంబాల నుంచి వివరాలను సేకరించనున్నారు. ఈ కులగణనలో మొత్తంగా 60 ప్రశ్నలు సంధించనున్నారు. ఇందులో సగం కుటుంబ నేపథ్యంపై ప్రశ్నలు ఉండగా.. మిగిలిన సగం వ్యక్తిగత వివరాలకు సంబంధించినవని తెలుస్తోంది. తినే తిండి నుంచి మొదలుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న ఏఏ సంక్షేమ పథకాలు అందుతున్నాయి... ఇంటి యజమాని ఉపాధి ఏంటి.... ఏడాదికి కుటుంబ ఆదాయం ఎంత ఇలాంటి ప్రశ్నలన్నీ ప్రజలను అడగనున్నారు.



**రాష్ట్రంలో 3.80 కోట్లకు పైగా జనాభా..**

రాష్ట్రంలో ప్రస్తుతం 3.80 కోట్లకు పైగా జనాభా ఉన్నారు. మొత్తం కుటుంబాల సంఖ్య 1.10 కోట్లు దాటి ఉంటుందని అంచనా. దీనికి తగ్గట్టుగానే సిబ్బంది నియామకానికి ప్రణాళికశాఖ ప్రతిపాదనలు రూపొందించింది. అయితే ప్రతి 150 కుటుంబాలకు ఓ సర్వే గణకుడిని నియమిస్తారు. ఈ లెక్కన చూసుకుంటే మొత్తం 75 వేల మంది అవసరం ఉంటుంది. వీళ్లపై పర్యవేక్షకులుగా మరో 15 వేల మంది వరకు అవసరం అవుతుంది. ఇందుకోసం వీళ్లందరినీ నియమించేందుకు అన్ని శాఖల సిబ్బంది వివరాలను సేకరిస్తున్నారు. అయితే ఉపాధ్యాయులను ఇలాంటి సర్వేలకు పంపించొద్దని గతంలో కోర్టు తీర్పులున్నాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖలోనే టీచర్లు కాకుండా 15 వేల మంది ఇతర ఉద్యోగులను ఈ సర్వే కోసం నియమించనున్నారు. ప్రతి ప్రభుత్వశాఖలో ఎంతమందిని తీసుకోవాలనేది జిల్లాలవారీగా వివరాలు పంపాలని కలెక్టర్లకు సూచనలు చేశారు. ఇక గ్రేటర్ హైదరాబాద్‌లో చూసుకుంటే కోటికి పైగా జనాభా ఉన్నారు. దీంతో ఇక్కడే 30 వేల మందికి పైగా గణకులు అవసరమవుతారని అధికారులు భావిస్తున్నారు.

గత బీఆర్ ఎస్ సర్కారు 2014 లో సమగ్ర సర్వే చేసి వివరాలు గోప్యంగా ఉంచడంపై అప్పట్లో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కులగణనలో ఎలాంటి వివాదాలు, ఆరోపణలు రాకుండా పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఈ అంశంలో సామాజికవేత్తలు, యూనివర్సిటీల ప్రొఫెసర్లు, పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సస్ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించింది. వారి నుంచి తగు సూచనలు, సలహాలు కూడా స్వీకరించింది. అదే సమయంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా కులగణన సాఫీగా జరగడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంది. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాల వారు ఎందరనే లెక్కల కొసమే రేవంత్ సర్కార్ ఈ సర్వే చేపడుతోందని తెలుస్తోంది.. వాళ్లతో పాటుగా రాష్ట్ర ప్రజల్లో ప్రతి ఒక్కరి కులం, ఉపకులం ఏంటి, స్థానికంగా కులాల పేర్లలో ఏమైనా మార్పులు జరిగాయా ఇలాంటి వివరాలన్నీ కూడా సేకరిస్తారు. ఎవరిదైనా కులం పేరు తప్పుగా నమోదైతే భవిష్యత్తులో అనేక రకాలుగా నష్టం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. తప్పుడు వివరాలు నమోదు కాకుండా స్థానిక అధికారులు పటిష్ఠంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

కుటుంబ సభ్యుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగానే భవిష్యత్తులో సంక్షేమ పథకాలతో పాటు అనేక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనుంది. ప్రతీ ఒక్కరి ఆధార్ కార్డు, పాన్ కార్డ్, మొబైల్ నంబర్లతో పాటు వివిధ వివరాలను నమోదు చేస్తారు. విద్యార్హత, ఉద్యోగం, సొంత ఇల్లు, కారు , బైకు వంటివి ఉన్నాయా అని ఇలా పూర్తి సమాచారాన్ని సేకరించనున్నారు. జనాభా లెక్కల కన్నా ఎక్కువ సమాచారాన్ని ఈ సర్వే నుంచి ప్రభుత్వం సేకరించనున్నట్లు తెలుస్తోంది.

**60 రోజుల్లో పూర్తి చేయాలి**

జిల్లాల్లో కుటుంబాల సంఖ్య ఆధారంగా కనీసం 2500 నుంచి 3 వేల మంది ఉద్యోగులను అన్నిశాఖల నుంచి ఈ సర్వే కోసం పంపిస్తారు. వీళ్లందరూ కూడా 15 రోజుల పాటు ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తారు. ఒకసారి సర్వే పూర్తయ్యాక వివరాలు పక్కాగా సేకరించారా లేదా అని కూడా ఆ తర్వాత తనిఖీ సర్వే కూడా చేయాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ నెలఖారులోగా సర్వేను ప్రారంభించేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మొత్తం 60 రోజుల్లోగా సర్వే నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని లక్ష్యం పెట్టుకున్నారు.



# యావత్ ప్రపంచమే పోటీ..

**(మొదటిపేజీ తరువాయి)** చేస్తున్నామని స్పష్టం చేశారు. వ్యాపారాల్లో రాణిస్తున్న వారు ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రావాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు.

**త్యాగాలతోనే నాయకులవుతాం...**

త్యాగాలు చేయకుండా గొప్ప నాయకులం కాలేమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మంచి లీడర్ అవ్వాలంటే త్యాగం చేసే గుణం, ధైర్యంతో ముందుకెళ్లే తత్వం ఉండాలని తెలిపారు. ప్రజలతో మమేకం అవ్వగలిగితే ఏదైనా సాధించవచ్చని చెప్పుకొచ్చారు. జీవితంలో రిస్క్ లేకుండా గొప్ప విజయాలు సాధించలేమని అన్నారు. మహాత్మాగాంధీ, జవహర్లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, మన్మోహన్ సింగ్, పీవీ నరసింహారావు సహా ఎంతో మంది నాయకులు మనందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. తాను నాయకత్వ లక్షణాలను వారి నుంచే నేర్చుకున్నానని గుర్తు చేశారు. నాయకులు డబ్బు, వ్యక్తిగత జీవితం, సమయం ఇలా చాలానే త్యాగాలు చేయాలని సీఎం రేవంత్ వివరించారు. మంచి లీడర్ కావాలంటే ధైర్యం, త్యాగం ఉండాలని విద్యార్థులకు సూచించారు. సిగ్గుపడకుండా ప్రజలతో మమేకమవ్వాలన్నారు. ఐఎస్బీలో ఉన్నవారంతా తెలంగాణ, దేశానికి అంబాసిడర్లు అని చెప్పారు. ధైర్యం, త్యాగాలే నాయకత్వంలో ముఖ్య లక్షణాలు అని సీఎం అన్నారు.

**ప్రజల కోసమే ఉన్నత లక్ష్యం..**

ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్రాన్ని చేయడం, తెలంగాణ ఎకానమీని ఒక ట్రిలియన్ ఎకానమీగా, హైదరాబాద్ ఎకానమీని 600 బిలియన్ ఎకానమీగా మార్చడమే ముందున్న లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతామని, ఇప్పటికే రాష్ట్రంలో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా యువతకు కెరీర్ అవకాశాలు పెంపొందిస్తామని, అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ తీసుకొచ్చి ఒలింపిక్స్ లో రాష్ట్రం నుంచి గోల్డ్ మెడల్స్ రావాలన్నారు. గచ్చిబౌలిలో స్పోర్ట్స్ యూనివర్సిటీ సిద్ధమవుతుందని, ఒలింపిక్స్లో పతకాలు సాధించే అతి పెద్ద దేశంగా ఉండాలని, సౌత్ కొరియా వంటి చిన్న దేశం ఒలింపిక్స్లో అనేక పతకాలు సాధిస్తుందని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని ఎడ్యుకేషన్ హబ్గా మార్చి చూపిస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఐఎస్బీలోని ప్రతి ఒక్కరు ఒక్కో లక్ష్యంతో ముందుకు సాగాలని, మీరు ఎక్కడికి వెళ్లినా హైదరాబాద్, తెలంగాణ గురించి మాట్లాడాలని, పెట్టుబడులు తెచ్చేందుకు కృషిచేయాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు.



# భరోసాపై భగ్గుమన్న బీఆర్ఎస్..





**(మొదటిపేజీ తరువాయి)** కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్ కు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుబంధును పూర్తిగా తొలగించే కుట్రలో భాగంగానే మంత్రివర్గ ఉపసంఘం, కొత్త మార్గదర్శకాలు రైతు భరోసా పేరుతో డ్రామాలు సృష్టిస్తున్నాయని ఆరోపించారు.

**రాస్తారోకోలు..**

వరంగల్, సంగారెడ్డి, జోగులాంబ గద్వాల, నిజామాబాద్, మహబూబ్‌బాద్, రాజన్న సిరిసిల్ల, స్యూర్యాపేట, మెదక్, ఆదిలాబాద్, నల్లగొండ, జగిత్యాల జిల్లాల్లో రాస్తారోకోలు నిర్వహించారు. తక్షణమే రైతు భరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి రాస్తారోకో నిర్వహించారు. సీఎం, మంత్రి తుమ్మల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఆయా జిల్లా నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీగా పాల్గొన్నారు.



